www.kalamdaily.com
Follow on: Kalamtelugu
# కలం
ప్రజల గళం...
08-03-2026, ఆదివారం   పేజీలు: 3

SINGLE TOPIC
360°
## మహిళా దినోత్సవం

## ఆకాశంలో సగం...

ప్రతి ఏటా వచ్చే అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మనకు వినిపించే మాట. పొలిటీషియన్లు గంభీర ఉపన్యాసాలు ఇవ్వడమూ ఓ ఆనవాయితీ.
ఓటు బ్యాంకు కోసం మహిళల పట్ల వరాలు కురిపించడం, వెల్ఫేర్ స్కీమ్స్ తేవడం రెగ్యులర్ ప్రాక్టీస్. వీటితో కొంత లబ్ధి కలుగుతున్నా నిర్ణయాధికారంలో మాత్రం ఆంక్షలు తప్పట్లేదు. టికెట్ల కేటాయింపులో మహిళలకు అవకాశాలు తక్కువే. చట్టసభల్లో 33% రిజర్వేషన్‌తో వచ్చే ఎన్నికల్లో వారి ప్రాతినిధ్యం పెరగనున్నది. రోదసీలోకి మహిళ అని గొప్పగా చెప్పకుంటూనే వంటింటి కుందేలు పాత్రకే పరిమితం చేసే కల్చర్ ఇప్పటికీ కొనసాగుతున్నది. ఎకనమిస్టులుగా, సైంటిస్టులుగా, కంపెనీల సీఈవోలుగా, వ్యాపారవేత్తలుగా.. ఇలా ఎన్ని విధాలుగా రాణించినా జెండర్ వివక్ష మాత్రం కంటిన్యూ. డిజిటల్ టెక్నాలజీ విస్తృత వినియోగంతో ట్రోలింగ్ మొదలు సైబర్ క్రైమ్ వరకు మహిళలు టార్గెట్ అవుతున్నారు.
నాణేనికి రెండు వైపులా మహిళల తాజా పరిస్థితిపై
కలం 360 డిగ్రీస్ స్పెషల్...

- తెలంగాణ బ్యూరో, కలం




# నారీ శక్తి

..అయినా ఆగని వివక్ష

ఆకాశంలో సగం అంటూనే ఆంక్షలు

అన్ని రంగాల్లో రాణించినా ఇంకా చిన్నచూపే

ఇంటా బయట ఆగని వేధింపులు



## ప్రభుత్వ కొలువుల్లో 35%

తెలంగాణలోని ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలు 35 శాతం ఉన్నారు. వివిధ శాఖల్లో సుమారు 5 లక్షల మంది ఎంప్లాయీస్ పనిచేస్తుంటే.. అందులో మహిళలు దాదాపు 1.8 లక్షల మంది వరకు ఉన్నట్లు లెక్కలు చెప్తున్నాయి. టీచింగ్ ఫీల్డ్‌లోనే ఎక్కువ మంది పని చేస్తున్నారు. విద్యాశాఖలో వీరు 50శాతంపైనే ఉన్నారు. ఆ తర్వాత వైద్య, ఆరోగ్య శాఖలో నర్సులు, డాక్ట ర్లు, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలుగా ఎక్కువ మంది ఆడబిడ్డలు ఉన్నారు.

## పోలీస్ శాఖలో 10% లోపే

తెలంగాణ పోలీసు శాఖలో ప్రస్తుతం సుమారు 67,000 మంది ఉంటే.. ఇందులో దాదాపు 6,700 మంది మహిళా పోలీసులు వివిధ హోదాల్లో ఉన్నారు. మొత్తం పోలీసుల్లో మహిళా పోలీసుల వాటా 8.6% - 10% మధ్య ఉంది. అంటే.. పది మంది పోలీసుల్లో ఒక్కరు మాత్రమే మహిళ!

- మొత్తం 128 మంది ఐపీఎస్ ఆఫీసర్లలో 32 మంది మహిళలు ఉన్నారు. వీరు కీలక విభాగాలైన సీఐడీ, సైబర్ సెక్యూరిటీ, విజిలెన్స్, ఇంటెలిజెన్స్, జైళ్లు, మహిళా భద్రతా విభాగాలకు ముఖ్య బాధ్యతలు నిర్వహిస్తున్నారు.
- మహిళా భద్రత కోసం ప్రత్యేకంగా పనిచేస్తున్న షీ టీమ్స్, భరోసా సెంటర్లు, మహిళా భద్రతా విభాగంలో మహిళా పోలీసుల ప్రాతినిధ్యం ఎక్కువగా ఉంది.
- జాతీయ సగటు (12.32%) తో పోలిస్తే తెలంగాణలో మహిళా పోలీసుల శాతం (10% లోపు) తక్కువగా ఉంది.
- మహిళా పోలీసుల్లో కానిస్టేబుల్ ర్యాంకుల్లోనే 90% మంది ఉన్నారు.
- పనితీరులో దేశంలోనే తెలంగాణ పోలీసు శాఖ తొలి స్థానంలో ఉంది. కానీ మహిళల ప్రాతినిధ్యం పది శాతం లోపే ఉంది.



## అండగా షీ టీమ్స్

తెలంగాణలో మహిళలకు అండగా షీటీమ్స్ పనిచేస్తున్నాయి. 2014 అక్టోబర్ 24న హైదరాబాద్‌లో ప్రారంభమైన ఈ వ్యవస్థ.. 2015 ఏప్రిల్ నుంచి రాష్ట్రవ్యాప్తంగా విస్తరించింది. మహిళలపై వేధింపులు, స్టాకింగ్, ఈవ్-టీజింగ్ వంటి నేరాలను అరికట్టేందుకు షీటీమ్స్ కృషి చేస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వ మహిళా భద్రత కార్యక్రమాల్లో ముఖ్య పోలీస్ వింగ్ గా పనిచేస్తున్నది. రాష్ట్ర ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో సుమారు 331 షీ టీమ్స్ పని చేస్తున్నాయి. ప్రస్తుత ప్రభుత్వంలో సైబర్ స్టాకింగ్, డిజిటల్ బ్లాక్‌మెయిలింగ్‌పై షీ టీమ్స్ ప్రత్యేక దృష్టి పెట్టాయి. 2025లో సుమారు 366 బ్లాక్ మెయిలింగ్ కేసులు, 121 మిడ్‌నైట్ హరాస్‌మెంట్ కేసులను సాల్వ్ చేశాయి. మెట్రో స్టేషన్లు, ఆస్పత్రులు, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌లో క్యూఆర్ కోడ్ వ్యవస్థ, షీటీమ్స్ వాట్సాప్ హెల్ప్‌లైన్, మొబైల్ యాప్ ద్వారా ఫిర్యాదుల స్వీకరణ వేగవంతం చేస్తున్నది. రాష్ట్రంలో ప్రస్తుతం 18 మహిళా పోలీస్ స్టేషన్లు ప్రత్యేకంగా మహిళల సమస్యల పరిష్కారం కోసం పని చేస్తున్నాయి. అదేవిధంగా ప్రతి పోలీస్ స్టేషన్‌లో మహిళా బాధితుల కోసం ఒక సింగిల్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్‌గా ఉమెన్ హెల్ప్ డెస్క్ పని చేస్తున్నది.


**షీటీమ్స్ వాట్సాప్ 87126 56856**

## అసెంబ్లీలో 7శాతమే

తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికి మూడుసార్లు అసెంబ్లీ ఎన్నికలు జరగ్గా.. ఈ పుష్కరకాలంలో మహిళా ఎమ్మెల్యేల శాతం ఏడు మాత్రమే! మొత్తం 119 సీట్లలో ప్రస్తుతం ఉన్న మహిళా ఎమ్మెల్యేలు 9 మంది మాత్రమే. 2014 టర్మ్‌లో తొమ్మిది మంది మహిళలు ఎమ్మెల్యేలయ్యారు. 2018లో కేవలం ఆరుగురే ఆ పదవిని దక్కించుకున్నారు. 2023 ఎన్నికల్లో పది మంది ఆడబిడ్డలు ఎమ్మెల్యేలుగా గెలిచారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత చనిపోవడంతో ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి గణేష్ విజయం సాధించారు. దీంతో మహిళా ఎమ్మెల్యేల సంఖ్య 9కి పడిపోయింది. మహిళలకు ఎమ్మెల్యే టికెట్లు దక్కడం, దక్కకపోవడం అనేది పార్టీల దయాదాక్షిణ్యాలపై కొనసాగుతున్నది. దీనికి 33 శాతం రిజర్వేషన్లతోనే ఫుల్ స్టాప్ పడుతుందని నమ్మిన ఆడబిడ్డలు గళమెత్తడంతో కేంద్ర ప్రభుత్వం ఓకే చెప్పింది. వచ్చేసారికి ఈ కోటా అమలయ్యే చాన్స్ ఉంది.

సబ్బండ వర్గాల పోరాటంతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం మహిళల్లేని కేబినెట్‌తో మొదలైంది. 2014లో అధికారంలోకి వచ్చిన కేసీఆర్.. ఆ టర్మ్‌లో మహిళలకు మంత్రి పదవి ఇవ్వలేదు. దీనిపై చాలా విమర్శలు వచ్చాయి. 2018 ముందస్తు ఎన్నికల్లో మళ్లీ ఆయన పవర్‌లోకి వచ్చినప్పటికీ.. ఏడాది పాటు మహిళలను కేబినెట్‌లోకి తీసుకోలేదు. 2019లో మాత్రం ఇద్దరికి అవకాశం ఇచ్చారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా ఇద్దరు మహిళలకు కేబినెట్‌లో చోటు దక్కింది.

## కేసీఆర్ ఫస్ట్ టర్మ్.. మహిళల్లేని కేబినెట్



కలం
ప్రజల గళం...
360° SINGLE TOPIC
08-03-2026,
ఆదివారం


# మహిళా దినోత్సవం

# నాయిక ఆన్ ఫైర్

**ట్రోల్స్, పాపరాజీపై నిరసన గళం**

అభినయంతో ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేసుకునే వెండితెర నాయికలు.. తమకు ఇండస్ట్రీలో, సమాజంలో ఎదురయ్యే సమస్యలపై బలంగా గళం విప్పుతున్నారు. ఒకప్పుడు 'రెడీ.. కెమెరా.. యాక్షన్' చుట్టూ మాత్రమే తిరిగే వాళ్లు.. ఇప్పుడు అన్ని అంశాలపై స్పందిస్తున్నారు. ప్రశ్నిస్తే ఎక్కడ అవకాశాలు రాకుండా పోతాయోనన్న భయాన్ని వదిలేశారు. ట్రోల్స్ నుంచి తాజాగా 'అన్నెసెసరీ జూమ్స్, పాపరాజీ' దాకా సినీ కథా నాయికలు ధైర్యంగా తమ గొంతు వినిపిస్తున్నారు.

## మేమేం వస్తువులం కాదు





పబ్లిక్ ఈవెంట్లకు, వివిధ ప్రైవేట్ కార్యక్రమాలకు సినీ తారలు తరచూ అటెండవుతుంటారు. ఆ ప్రోగ్రామ్స్‌ను కవర్ చేసే టైమ్‌లో కొందరు ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు అత్యుత్సాహం చూపుతున్నారు. యూట్యూబ్ చానళ్లు భారీగా పెరిగిపోయినందున హీరోయిన్స్ ఫొటోలను, వీడియోలను అందరికంటే ముందే తాము పోస్టు చేసి లైకులు, వ్యూస్ సంపాదించాలని ఆరాటపడుతున్నారు. హీరోయిన్స్ శరీర భాగాలను జూమ్ చేసి ఫొటోలు, వీడియోలు తీస్తూ.. ఇష్టమొచ్చినట్టు థంబ్‌నైల్స్ క్రియేట్ చేసి పోస్టు చేస్తున్నారు. దీనికి వ్యతిరేకంగా సినీ నాయికలు వరుస పోస్టులతో తాజాగా ఉద్యమం స్టార్ట్ చేశారు. ''సినీ ఇండస్ట్రీలోని మహిళలకు తరచూ ఎదురవుతున్న ఓ ప్రధాన సమస్యపై గళం విప్పుతున్నాం.. ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు పాపరాజీ ఆపాలి'' అంటూ సౌత్ ఇండియా స్టార్స్ సప్తమి గౌడ, అషికా రంగనాథన్, రుక్మిణీ వాసంత్ తమ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టులు పెట్టారు. నటీనటులు అనగానే కొందరు వస్తువులుగా చూస్తున్నారని నాయికలు మండిపడ్డారు. "పబ్లిక్ ఈవెంట్లలో పాల్గొనే మహిళా నటులను అసభ్య కోణాల్లో ఫొటోలు, వీడియోలు తీయడం ఏమిటి? మా బాడీని జూమ్ చేసి చూపించడానికి మేమేం మీ ఇంట్లోని వస్తువులం కాదు. కొంత మంది చేస్తున్న ఇలాంటి పనులు ఎన్నటికీ ఆమోదయోగ్యం కాదు. మా జీవితమంతా సినిమానే. దాని కోసమే మేం ఈవెంట్స్‌లో పాల్గొంటున్నాం. కావాలని జూమ్ చేస్తూ అసభ్యకరంగా ఫొటోలు, వీడియోలు తీసి ఇష్టమున్నట్లు థంబ్‌నైల్స్ జోడించి మీ పాపరాజీని మాపై రుద్దొద్దు. ఒకరి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే హక్కు ఇంకొకరికి లేదు. మీ కెమెరాలను హద్దుల్లో ఉంచుకోండి'' అంటూ 'కాంతారా' నటి సప్తమిగౌడ తన పోస్టులో స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఇదే బాటలో 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' నటి అషికా రంగనాథ్, 'టాక్సిక్' తార రుక్మిణీ వాసంత్ కూడా గొంతెత్తారు. పలువురు తారలతో పాటు నెటిజన్లు కూడా భారీగా మద్దతు తెలుపుతున్నారు. ట్రోల్స్, ప్రైవసీ ఉల్లంఘనలపై గతంలో అనన్య నాగళ్ల, మంచు లక్ష్మి, ఆలియాభట్, మృణాల్ ఠాకూర్, జాన్వీకపూర్, తాప్సి, అనసూయ వంటి వారు చాలాసార్లు గళమెత్తారు.



## 'మీ టూ'తో మొదలు

లైంగిక వేధింపులకు గురైన మహిళలకు సానుభూతి కోసం 2006లో అమెరికాకు చెందిన సోషల్ యాక్టివిస్ట్ తరానా బర్క్ 'మీ టూ' అనే పదాన్ని ఉపయోగించి ఉద్యమం మొదలుపెట్టారు. అయితే.. 2017 అక్టోబర్‌లో హాలీవుడ్ నటి "If you've been sexually harassed or assaulted write 'me too'' అని సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో ఇది అంతర్జాతీయంగా పాపులర్ అయింది. 2018లో బాలీవుడ్ నటుడు నానా పటేకర్‌పై నటి తనుశ్రీ దత్త ఆరోపణలు చేయడంతో 'మీ టూ' ఉద్యమం టాలీవుడ్, కోలీవుడ్, సాండిల్ వుడ్, మాలీవుడ్ వరకు వ్యాపించింది. ఆ ఉద్యమ స్ఫూర్తిని నవనాయికలు కొనసాగిస్తున్నారు.



## క్రీడల్లో కీర్తికిరీటాలు

క్రీడారంగంలో తెలంగాణ ఆడబిడ్డలు సత్తా చాటుతున్నారు. నిజామాబాద్‌కు చెందిన నిఖత్ జరీన్ బాక్సింగ్‌లో రెండుసార్లు ప్రపంచ స్థాయి చాంపియన్‌గా నిలిచారు. టేబుల్ టెన్నిస్ లో హైదరాబాద్‌కు చెందిన ఆకుల శ్రీజ అంతర్జాతీయ స్థాయి అత్యుత్తమ ర్యాంకింగ్‌లో ఉన్నారు. పారా ఒలంపిక్స్‌లో వరంగల్ బిడ్డ అథ్లెట్ దీప్తి జీవాంజి పతకాన్ని తెచ్చిపెట్టారు. పీవీ సింధు, సానియా మిర్జా, గుత్తా జ్వాలా వంటి వారు కొత్త వారికి ఆదర్శంగా నిలుస్తున్నారు. క్రికెట్‌లో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన గొంగడి త్రిష అద్భుత ఆటతీరు కనబరుస్తున్నారు. అండర్ 19 వరల్డ్ కప్ సాధించి పెట్టిన టీమ్‌లో త్రిష ఒకరు!! వీరే కాదు.. చాలా మంది ఇక్కడి ఆడబిడ్డలు క్రీడరంగాన్ని ఏలుతున్నారు.



## స్ఫూర్తి ప్రదాతలుగా...

వైద్య, వ్యాపార రంగాల్లో తెలంగాణ మహిళలు స్ఫూర్తిప్రదాతలుగా నిలుస్తున్నారు. డాక్టర్ శైలజ దొనేపూడి శాస్త్రసాంకేతిక రంగంలో విశేష గుర్తింపు పొందారు. సీఎస్ఐఆర్‌లో బిజినెస్ డెవలప్‌మెంట్ గ్రూప్‌కు తొలి మహిళా డిస్టింగ్విష్డ్ సైంటిస్టుగా బాధ్యతలు చేపట్టారు. ప్రముఖ గైనకాలజిస్ట్ మంజుల అనగాని పద్మశ్రీ అవార్డును అందుకున్నారు. వైద్య, వ్యాపార రంగాల్లో డాక్టర్ సునీతా రెడ్డి, ఉపాసన కొణిదెల, సుచిత్ర ఎల్లా వంటి వారు దూసుకుపోతున్నారు. స్టార్టప్‌లను స్టార్ట్ చేసి.. ఎదిగిన వారిలో అనురాధ ఆచార్య (జీనోమిక్స్), దీప్తిరెడ్డి, కవిత అయ్యర్ వంటి వారు ఉన్నారు.




## పెరుగుతున్న అవగాహన..

మహిళలు ఒకప్పుడు వేధింపులను మౌనంగా భరించేవారు. ఇప్పుడు వాళ్లలో అవగాహన పెరిగింది. ధైర్యంగా బయటకు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు. ఇంట్లో, బయట, సోషల్ మీడియాలో.. ఇలా ఎక్కడైనా సరే ఎవరైనా వేధింపులకు పాల్పడితే తగిన సమాధానం చెబుతున్నారు.

- తెలంగాణలో మహిళలపై వేధింపులు పెరగడంతో 2014లో షీ టీమ్స్‌ను ప్రారంభించారు. మొదట హైదరాబాద్, ఆ తర్వాత రాష్ట్రమంతటా విస్తరించారు.
- షీటీమ్స్ రాకతో మహిళలకు భరోసా దొరికింది. వాళ్లలో అవగాహన పెరిగింది.
- మహిళలు ఎక్కువగా వేధింపులు ఎదుర్కొనే బస్ స్టాప్స్, కాలేజీలు, మార్కెట్ల లాంటి ప్రదేశాల్లో షీటీమ్ పోలీసులు మఫ్టీలో విధులు నిర్వహిస్తూ ఆకతాయిల పని పడుతున్నారు.

## ఆగని అకృత్యాలు


దేశవ్యాప్తంగా, తెలంగాణలోనూ మహిళలపై అకృత్యాలు ఏటేటా పెరుగుతూ ఉన్నాయి. దేశంలో మహిళలపై నేరాలకు సంబంధించిన కేసులు 2020లో 3.71 లక్షలు నమోదు కాగా.. ఆ సంఖ్య 2021లో 4.28 లక్షలు, 2022లో 4.45 లక్షలు, 2023లో 4.48 లక్షలుగా నమోదైంది. ఇక తెలంగాణలో 2020లో 17,791 కేసులు నమోదు కాగా.. ఆ సంఖ్య 2025 నాటికి 20,551కి చేరింది. 2023తో పోలిస్తే 2024లో కేసుల సంఖ్య తగ్గినప్పటికీ, 2025లో మళ్లీ పెరిగింది. రాష్ట్రంలో ఎక్కువగా గృహ హింస, లైంగిక వేధింపులు, రేప్‌లు, కిడ్నాప్‌లు, వరకట్న వేధింపుల కేసులు నమోదయ్యాయి.

## ఈవ్ టీజింగ్ ఇబ్బందులు

మహిళలకు వేధింపులు ఎక్కువయ్యాయి. ఆడవాళ్లను ఆకతాయిలు పబ్లిక్ ప్రదేశాల్లో ఈవ్ టీజింగ్ చేయడంతో పాటు సోషల్ మీడియాలోనూ వేధిస్తున్నారు. ఇలాంటి కేసులు ఇటీవల కాలంలో పెరిగిపోయాయి. 2025లో హైదరాబాద్‌లో బోనాల సందర్భంగా 644 మంది ఈవ్ టీజింగ్ కేసుల్లో పట్టుబడ్డారు. 2026లో నుమాయిష్ ఎగ్జిబిషన్‌లో 264 మంది ఈవ్ టీజర్స్ దొరికారు. రాష్ట్రంలో ప్రతిఏటా నమోదవుతున్న వేధింపుల కేసుల్లో ఈవ్ టీజింగ్ కేసులే 40 శాతం వరకు ఉంటున్నాయి.

**తెలంగాణలో మహిళలపై జరిగిన క్రైమ్స్..**

| ఏడాది | కేసులు |
|---|---|
| 2020 | 17,791 |
| 2021 | 20,865 |
| 2022 | 22,066 |
| 2023 | 23,678 |
| 2024 | 19,922 |
| 2025 | 20,551 |



కలం
ప్రజల గళం...
360° SINGLE TOPIC
08-03-2026,
ఆదివారం








మహిళలనుద్దేశించి ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన మహాలక్ష్మి అంశం కాంగ్రెస్‌ను పవర్‌లోకి తీసుకొచ్చింది. అందుకే కొలువుదీరిన రెండు రోజుల్లోనే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని అమల్లోకి తెచ్చింది. కుటుంబ వ్యవహారాల్లో మహిళలపై పడే భారాన్ని దృష్టిలో పెట్టుకుని వంటగ్యాస్ సిలిండర్‌ను రూ. 500కే ఇవ్వడం, 200 యూనిట్లలోపు విద్యుత్ బిల్లుల మాఫీ, వడ్డీ లేని రుణాల మంజూరు, స్వయం సహాయక మహిళా సంఘాలకు యూనిఫామ్ ఆర్డర్లు , ఇందిరా మహిళా శక్తి పేరుతో ప్రభుత్వ కార్యాలయాల్లో క్యాంటీన్ల అప్పగింత, పెట్రోలు బంకుల నిర్వహణ, ఆర్టీసీకి అద్దె బస్సులను సరఫరా చేసేందుకు బ్యాంకుల ద్వారా రుణసౌకర్యం.. ఇలాంటి అనేక విధాన నిర్ణయాలకు శ్రీకారం చుట్టింది. ఇవన్నీ అమల్లోకి వచ్చాయి.

# మహిళలకు చేయూత

## మహిళల పేరుతో ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు

మహిళల పేరుతోనే రేషను కార్డులు, ఇందిరమ్మ ఇండ్లను ఇవ్వాలని స్పష్టమైన నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం దాన్నే కొనసాగిస్తున్నది. గత ప్రభుత్వం కొత్త రేషను కార్డుల్ని అప్లికేషన్ల స్థాయిలో ఇవ్వకపోవడంతో ఇప్పుడు దరఖాస్తుల్ని ఆహ్వానించి కొత్తగా మంజూరు చేస్తున్నది. వాటిలో మహిళలనే కుటుంబ పెద్దగా పేర్కొంటున్నది. ఇందిరమ్మ ఇండ్లు సైతం పూర్తిగా మహిళల పేరుతోనే మంజూరు చేస్తున్నది. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి కనీసంగా మూడున్నర వేల చొప్పున మొత్తం నాలుగున్నర లక్షల ఇండ్లను ఒక్కోదానికి రూ. 5 లక్షల సాయంతో నిర్మించాలన్నది ప్రభుత్వ టార్గెట్. కొన్నిచోట్ల ప్రారంభోత్సవాలు జరగ్గా ఇంకొన్ని చోట్ల నిర్మాణంలో ఉన్నాయి. త్వరలో పట్టణ ప్రాంతాల్లోనూ సొంత జాగ ఉన్నవారికి ఇంటిని నిర్మించుకునేందుకు సాయం ఇవ్వాలనుకుంటున్నది.




## రెసిడెన్షియల్ స్కూళ్లతో తగ్గిన బాలికల డ్రాపౌట్స్


గ్రామీణ ప్రాంతాల్లో వివిధ సమస్యల కారణంగా విద్యా సంస్థల్లో బాలికల అడ్మిషన్లు తగ్గడం, డ్రాపౌట్స్ పెరగడాన్ని దృష్టిలో పెట్టుకున్న గత ప్రభుత్వం రెసిడెన్షియల్ స్కూళ్లవ్యవస్థను బలోపేతం చేసింది. గతంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు వేర్వేరుగా ఉండే విధానం సామాజిక, కుల వివక్షకు దారితీస్తుందనే ఉద్దేశంతో అన్నింటినీ ఒకే గొడుకు కిందికి తీసుకొచ్చేలా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లనిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ప్రతి ఏటా సగటున మూడున్నర లక్షల మంది బాలికలు రెసిడెన్షియల్ స్కూళ్లలో చేరుతున్నారు. దీంతో బాలికల డ్రాపౌట్స్ తగ్గాయి.. స్కూళ్లలో అడ్మిషన్లు పెరిగాయి. మరోవైపు పుష్కర కాలంలో మహిళల అక్షరాస్యత పెరిగింది. రాష్ట్రం ఏర్పడే నాటికి గ్రామీణ మహిళల్లో 55% అక్షరాస్యత ఉంటే ఇప్పుడు అది 62%కి పెరిగింది.




## సీఎం రేవంత్ ప్రశంసలు

**అధికారంలోకి రావడంతోనే మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఐదేండ్ల కాలంలో కోటి మంది మహిళలను కోటీశ్వరుల్ని చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మహిళా సంఘాలకు బ్యాంకుల నుంచి రుణం రూపంలో మార్గాన్ని సుగమం చేయడంతో పాటు ప్రతి నెలా వాటికి ఆదాయం సమకూరే స్కీమ్‌లను ప్రవేశపెట్టి అమలు చేయిస్తున్నారు. మహిళాభివృద్ధిపై వివిధ సందర్భాల్లో సీఎం చేసిన వ్యాఖ్యల్లో కొన్ని..**

- మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబం బాగుపడుతుంది.. ఆ తర్వాత రాష్ట్రం డెవలప్ అవుతుంది.
- కార్పొరేట్ కంపెనీలు బ్యాంకులకు రుణాలను ఎగ్గొడతాయేమోగానీ.. మహిళా సంఘాలు మాత్రం క్రమం తప్పకుండా నిజాయితీగా చెల్లిస్తాయి. మహిళలకు ఆర్థిక క్రమశిక్షణ ఎక్కువ.
- రాష్ట్ర గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు మహిళా సంఘాలు వెన్నెముక లాంటివి.
- ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం సంక్షేమం మాత్రమే కాదు.. అంతకంటే ఎక్కువగా వారికి ఆర్థిక స్వేచ్ఛ ఇచ్చే వెసులుబాటు.
- మహిళలు ఉద్యోగాల కోసం ఎదురుచూడొద్దు.. మహిళా సంఘాలు కలిసి వ్యాపారాలు ప్రారంభించి ఇతరులకే ఉపాధి కల్పించేలా ఎదగాలి.
- మహిళలు ఎదుగుదలతోనే సమాజం బలపడుతుంది.. రాష్ట్ర అభివృద్ధి వారితోనే సాధ్యమవుతుంది.
- మహిళలు నాయకత్వం వహిస్తే పాలన పారదర్శకంగా ఉంటుంది.. అందుకే రాజకీయాల్లోకి మహిళలు ఎక్కువగా ఎంటర్ కావాలి.
- మహిళలు వెల్ఫేర్ స్కీమ్ లబ్ధిదారులుగా మాత్రమే ఉండొద్దు.. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపించే శక్తిగా తీర్చిదిద్దాలి. అందుకే ఇందిరా మహిళా శక్తితో క్యాంటీన్లు, స్కూల్ యూనిఫాం తయారీ, ఈ–కామర్స్ మార్కెటింగ్ ఫెసిలిటీ, సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు, ఆర్టీసీకి అద్దె బస్సులిచ్చే ఏజెన్సీలుగా తీర్చిదిద్దడం.. చేస్తున్నాం.
- మహిళలకు గౌరవం, భద్రత, ఆర్థిక స్వాతంత్ర్యం.. ఇవే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రాధాన్యతలు.



- ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం స్కీమ్‌తో 2023 డిసెంబరు 9 నుంచి ఫిబ్రవరి 2026 చివరి వరకు మొత్తం 273 కోట్ల టికెట్లు జారీ అయ్యాయి. రోజుకు సగటున 10 లక్షల పైనే ఫ్రీ టికెట్స్. దాదాపు తొమ్మిదిన్నర వేల కోట్ల మేర ప్రభుత్వంపై భారం పడినా మహిళలకు ప్రయోజనం కలిగింది.
- మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల స్కీమ్ కింద ప్రతి ఏటా సగటున రూ. 20 వేల కోట్ల రుణం బ్యాంకుల నుంచి మంజూరవుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం గడచిన రెండేండ్లలో మహిళా సంఘాల తరఫున బ్యాంకులకు రూ. 1,120 కోట్లను వడ్డీ మాఫీ కోసం చెల్లించింది. సుమారు మూడున్నర లక్షల మహిళా సంఘాల్లోని మహిళలు లబ్ధి పొందారు. ప్రస్తుతం 63 లక్షల మంది మహిళలు ఈ సంఘాల్లో సభ్యులుగా ఉన్నారు. దీన్ని కోటికి పెంచాలన్నది ప్రభుత్వ టార్గెట్.
- వంట గ్యాస్ సిలిండర్లను రూ. 500కే సరఫరా చేయడం ద్వారా సుమారు 43 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరింది.
- గృహజ్యోతి స్కీమ్ పేరుతో 200 యూనిట్ల వరకు విద్యుత్ బిల్లు మాఫీ కావడంతో దాదాపు 50 లక్షల కుటుంబాలకు ప్రయోజనం. నెలకు యావరేజ్‌గా వెయ్యి రూపాయల వరకు కుటుంబాలకు సేవింగ్.
- మహిళా సంఘాలకు వెయ్యి మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసే సోలార్ పవర్ ప్లాంట్‌ల ఏర్పాటుకు ప్రోత్సాహం. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రభుత్వ స్థలం కేటాయింపు, ప్రభుత్వ అనుమతి మంజూరు.
- ఆర్టీసీకి అద్దె బస్సుల్ని సరఫరా చేసేందుకు మహిళా సంఘాలకు ప్రభుత్వమే బ్యాంకు ద్వారా రుణం కల్పిస్తున్నది. మొత్తం 600 బస్సులు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుంటే ఇప్పటికే 150 బస్సులు తిరుగుతున్నాయి. అద్దె రూపంలో నెలకు రూ. 77 వేల చొప్పున మొత్తం రూ. 5 కోట్లు సంఘాలకు అందాయి. మరో 200 బస్సులు రెడీ అవుతున్నాయి. ఒక్కో బస్సు కొనుగోలుకు అయ్యే రూ. 36 లక్షల్లో రూ. 30 లక్షలను బ్యాంకుల ద్వారా సెర్ప్ 'కమ్యూనిటీ ఇన్వెస్ట్ మెంట్ ఫండ్' పేరుతో సమకూరుస్తున్నది.
- ప్రభుత్వ స్కూల్ యూనిఫామ్‌లను కుట్టించే కాంట్రాక్టు మహిళా సంఘాలకు దక్కింది. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం 'అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ'ల పేరుతో మహిళా సంఘాలకు అప్పగించింది ప్రభుత్వం.
- మహిళలు, స్వయం సహాయక బృందాలు తయారుచేస్తున్న వివిధ రకాల ఆహార, హస్తకళల ఉత్పత్తులకు ఈ-కామర్స్ ద్వారా అమెజాన్ లాంటి సంస్థలతో ఒప్పందం కుదిర్చి మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తున్న ప్రభుత్వం.. హైదరాబాద్‌లోని శిల్పారామంలో మహిళా సంఘాలకు మార్కెట్ నిర్మించి ఇచ్చింది.